


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శుక్రవారం
20-02-2026
పేజీలు: 02

# రైతు భరోసా కోసం ఎదురుచూపులు



ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు రైతుభరోసా నిధులు ఎప్పుడు విడుదల అవుతాయన్నది సస్పెన్స్ గా మారింది. అధికారులకు సైతం దీనిపై స్పష్టత కొరవడింది. రైతులు పంట సాయం పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దాదాపు రాష్ట్రమంతా వరి నాట్ల పనులు పూర్తయ్యాయి. విత్తనాలు, నాట్లు, పురుగుమందులు, ఎరువుల కోసం రైతులు సొంత డబ్బుల్ని వాడుకున్నారు. కొందరు పంట పెట్టుబడిని అప్పల ద్వారా సమకూర్చుకున్నారు. ప్రభుత్వం విడుదల చేస్తే ఆ డబ్బును అప్పులు తీర్చుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో డైలమాలో పడ్డారు. సంక్రాంతి గిఫ్టుగా అందుతుందని తొలుత లీకులు వచ్చాయి. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే అందుతాయన్న వార్తలు వెలువడ్డాయి. కానీ అది 'అందని ద్రాక్ష'గానే మిగిలిపోయింది. సాగులో ఉన్న భూములకే రైతుభరోసా సాయాన్ని అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. సాగులో ఉన్న భూముల లెక్క తేల్చే పని రెండు నెలల క్రితమే మొదలైంది. ఇందుకోసం శాటిలైట్ ఇమేజ్, డిజిటల్ మ్యాపింగ్ పద్ధతులను ప్రభుత్వం ఎంచుకున్నది. సమగ్రమైన డేటాను వ్యవసాయ శాఖకు అందిస్తే దానికి అనుగుణంగా రైతుభరోసా నిధులు విడుదల చేస్తుంది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం భూముల 'డిజిటల్ సర్వే' ప్రక్రియ చేపట్టాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది. ఒకటిన్నర నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికావాలని స్పష్టత ఇచ్చింది. ఒకవైపు డిజిటల్ సర్వే మరోవైపు శాటిలైట్ ఇమేజెస్, మ్యాపింగ్ కారణంగా సాగుభూముల లెక్క అగమ్యగోచరంగా మారింది. 'సాగులో ఉన్న భూములకే' రైతు భరోసా సాయం అని ప్రభుత్వం నిబంధన పెట్టిన కారణంగా లెక్కలు తేలేదెన్నడో.. సాయం అందేదెన్నడో.. అనే అసంతృప్తి రైతుల్లో వ్యక్తమవుతున్నది.



## మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి కాంగ్రెస్ బంపర్ ఆఫర్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా జీహెచ్ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేరు దాదాపు ఖరారైంది. ఇంతకాలం చైర్‌పర్సన్‌గా ఉన్న నేరెళ్ల శారద పదవీకాలం అయిపోవడంతో కొత్త పాలకవర్గం ఏర్పడాల్సి ఉన్నది. ఈ పోస్టు కోసం పలువురు మహిళా నేతలు పోటీ పడుతున్నప్పటికీ చివరకు గద్వాల విజయలక్ష్మి ఖరారయ్యే అవకాశాలున్నాయి. త్వరలోనే ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటన చేయనున్నది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నేత మొగిలి సునీతారావ్ సైతం ప్రయత్నిస్తున్నారు. ఇక పార్టీకి చెందిన రేగులపాటి రమ్యారావు (కేసీఆర్ బంధువు), స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన సింగారపు ఇందిర, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఇందిరా శోభన్ తదితరులు కూడా ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు.




## పురిటి నొప్పులు భరించలేక.. కత్తితో కడుపు కోసుకున్న గర్భిణి

'అమ్మా' అనే పిలుపు కోసం ఓ మహిళ పడే తపన ఎంత గొప్పదో.. ఆ పిలుపును అందుకోవడానికి ఆమె అనుభవించే ప్రసవ వేదన అంత భయంకరమైనది. కానీ, ఆ వేదన కట్టలు తెంచుకుంటే అది ఎంతటి అనర్థానికి దారితీస్తుందో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటన కళ్లకు కడుతోంది. ఆసుపత్రికి తీసుకు వెళ్లే వారు లేక.. పురిటి నొప్పుల తీవ్రతను తట్టుకోలేక ఓ గర్భిణీ తన కడుపును కత్తితో కోసుకున్న ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. నంద్వాల్ గ్రామానికి చెందిన నంకై (35) జీవితం గత ఆరు నెలలుగా కష్టాలతోనే సాగుతోంది. అనారోగ్యంతో భర్త చనిపోవడంతో గర్భిణీ అయిన ఆమె ఒంటరిగానే కాలం వెళ్లదీస్తోంది. నెలలు నిండడంతో గురువారం మధ్యాహ్నం ఆమెకు అకస్మాత్తుగా ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. సహాయం కోసం కేకలు వేసినా ఎవరూ వినిపించలేదు. నొప్పులు క్షణక్షణానికి రెట్టింపవుతుంటే, ఆ బాధను భరించలేక విచక్షణ కోల్పోయిన ఆమె.. వంటింట్లోని కూరగాయలు కోసే కత్తితో తన పొత్తికడుపును కోసుకుంది.

## అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి




'రెడ్డి', 'రావు' ఎవరైనా తమ కాళ్ల వద్దకు రావాల్సిందేనని ఇటీవల మజ్లిస్ పార్టీ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై బీజేపీ శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. అక్బరుద్దీన్ హిందువుల పట్ల హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల కారణంగా చాలామంది కులాలుగా విడిపోయారని, ఇది మజ్లిస్ పార్టీకి చులకన అయిందని అన్నారు. కానీ ఇప్పుడు తామంతా కులాలను మరిచిపోయి హిందువులుగా మారుతున్నామని అన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువులంతా ఏకమవుతున్నారని అన్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ కూడా అలాంటి విమర్శలు చేస్తే చీము నెత్తురు లేని హిందువులకు తెలిసి వస్తుందని అన్నారు. హిందువులు పాములు అని అక్బరుద్దీన్ విమర్శలు గుప్పించారని, అదే నిజమైతే మీరు మూడు కోట్ల నుంచి 20 కోట్లకు వచ్చేవారా? అని నిలదీశారు. అసలైనా పాములు ఒవైసీ లాంటివారేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. అక్కడ హిందువులను పాములై కరుస్తున్నారని రాకేశ్ రెడ్డి అన్నారు. ఒవైసీ సోదరులు ఎప్పుడూ హిందువులకు, హిందుత్వానికి వ్యతిరేకంగా ఉంటారని ఆరోపించారు. కొన్ని రోజుల క్రితం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రెడ్డి అయినా, రావు అయినా తమ వద్దకు రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రుల వద్దకు మేం వెళ్లమని, వారే మా వద్దకు వస్తారని అన్నారు. పనులు కావాలన్నా, సీఎం కావాలన్నా మా మద్దతు ఉండాల్సిందే అన్నారు. ఒవైసీల మద్దతు లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకే ఉందని అన్నారు.



## తిరుమల లడ్డూపై డిబేట్లు ఆపండి.. టీవీ చానళ్లకు కోర్ట్ నోటీస్‌లు

తిరుమల లడ్డూ చుట్టూ జరుగుతున్న రాజకీయాలపై విజయవాడ కోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సున్నితమైన అంశంపై డిబేట్లు పెట్టడం ఆపాలని పలు చానళ్లకు నోటీస్‌లు జారీ చేసింది. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వాడారంటూ గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఈ అంశంపై తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేగింది. వైసీపీ, కూటమి పరస్పర ఆరోపణల అనంతరం విషయం సుప్రీం కోర్ట్ వరకు వెళ్లింది. దీంతో కోర్ట్ నిజానిజాలు తేల్చేందుకు సిట్ వేయగా తిరుమల లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని వెల్లడైంది. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు లేదని సిట్ నివేదిక ఇచ్చినా కూడా పలు టీవీ చానళ్లు ఆ అంశంపై డిబేట్లు పెడుతూ రాద్ధాంతం చేస్తున్నాయని, ఇలాంటి చర్యలతో మత విశ్వాసాలు దెబ్బతింటాయని, అలాంటి కథనాలు ప్రచురించకుండా ఆదేశాలు ఇవ్వాలని చింతా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి విజయవాడ సీనియర్ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్ట్ శుక్రవారం విచారణ చేపట్టింది.

## హరీశ్‌రావుపై కవిత సంచలన సవాల్




సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై రోజుకో కామెంట్‌తో కల్వకుంట్ల కవిత విరుచుకుపడుతున్నారు. తొలుత 'దయ్యం', ఆ తర్వాత 'గుంట నక్క', మరో సందర్భంలో 'తెలంగాణ చంద్రబాబు' అంటూ కామెంట్ చేశారు. రాజకీయంగా ఆయనను ఢీకొట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. దానికి కొనసాగింపే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్దిపేట్ తన ఫస్ట్ ఛాయిస్ అనే ప్రకటన. సిద్దిపేట్ అడ్డా నుంచే హరీశ్‌రావుకు సవాలు విసరాలనుకుంటున్నారు. హరీశ్‌రావును పొలిటికల్‌గా తనదైన శైలిలో ఉచ్చులోకి లాగుతున్నారా? ఆయన అటెన్షన్‌ను డైవర్ట్ చేయడానికే ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారా? ఆయనను కేవలం సిద్దిపేట్‌కే పరిమితం చేసే వ్యూహమా ఇది? నిజంగా అక్కడ పోటీచేసి ఆయనను ఢీకొట్టే సత్తా కవితకు ఉన్నదా? ఇరవై ఏండ్లకు పైగా ఎదురులేని నాయకుడిగా ఉన్న ఆయనపై కవిత గెలుపు సాధ్యమేనా?.. ఇవన్నీ ఇప్పుడు వినిపిస్తున్న మాటలు. హరీశ్‌రావు రాజకీయాల్లోకి వచ్చింది మొదలు సిద్దిపేట్ నుంచి పోటీ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ 2004 ఉప ఎన్నికలో అక్కడి నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటి నుంచి అదే సెగ్మెంట్‌లో వరుస విజయాలు సాధిస్తున్నారు. ఏటేటా ఆయన ఆదరణ పెరుగుతూనే ఉన్నది. ఆయనకు పడే ఓట్లుగానీ, ప్రత్యర్థి కంటే ఎక్కువగా సాధించిన మార్జిన్‌గానీ పెరుగుతూనే ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో (2018)లో అత్యధికంగా 1.18 లక్షల ఓట్ల మార్జిన్‌తో గెలిచారు. మొత్తం పోలైన ఓట్లలో దాదాపు 79% ఒక్క హరీశ్‌రావుకే వచ్చాయి. 2023 ఎన్నికల్లో మార్జిన్ 82 వేలకు పడిపోయినా ఏ పార్టీ కూడా ఆయన గెలుపును ఆపలేకపోయింది. ఒకే నియోజకవర్గం నుంచి వరుసగా ఏడుసార్లు గెలిచిన హరీశ్‌రావును ఇప్పుడు కల్వకుంట్ల కవిత ఏ రకంగా ఢీకొట్టగలరనేది కీలకమైన అంశం. కాంగ్రెస్, బీజేపీ లాంటి పార్టీలు క్షేత్రస్థాయిలో అందనంత దూరంలోనే ఉన్నాయి.



## తల్లి ప్రోత్సాహంతోనే హత్యలు

తల్లి ప్రోత్సాహంతోనే పిన్నమ్మ, ఆమె కుమారుడి హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. తరిమెల ఎస్సీ కాలనీలో జరిగిన జంట హత్యల కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కౌలుట్లయ్య గురువారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీకి చెందిన దండోరా నల్లప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య డండోరా లక్ష్మీదేవికి డండోరా జగ్జీవన్‌రామ్(అలియాస్ మోహన్), దండోరా ఓంకార్ (అలియాస్ పిట్టి) కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో భార్య దండోరా యల్లమ్మకు దండోరా సాయికుమార్, దండోరా అంబేడ్కర్(అలియాస్ చిన్న)అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. సాయికుమార్ ఐదేళ్ల కిందట మృతి చెందాడు. దండోరా నల్లప్ప కూడా మూడేళ్ల కిందట మృతి చెందాడు. నల్లప్పకు చెందిన పొలం, ఇంటిని రెండో భార్య దండోరా యల్లమ్మ రాయించుకుందని, పెద్ద భార్య దండోరా లక్ష్మీదేవి, ఆమె కుమారులు గొడవ పడేవారు. దీనిపై పలుమార్లు పంచాయితీలు జరిగినా వివాదం పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో తరిమెలలో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్న యల్లమ్మను, ఆమె కుమారుడు అంబేడ్కర్‌ను చంపితేనే ఇల్లు, పొలం దక్కుతాయని పెద్దభార్య లక్ష్మీదేవి తన కుమారులను రెచ్చగొట్టింది. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి పెద్ద భార్య లక్ష్మీదేవి, ఆమె ఇద్దరు కుమారులు, మరో ఇద్దరు కలిసి యల్లమ్మ ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగారు. ఈక్రమంలోనే పాశవికంగా యల్లమ్మను వేటకొడవళ్లతో నరికి చంపారు. పారిపోతున్న తమ్ముడు అంబేడ్కర్‌ను సైతం రాళ్లతో కొట్టి చంపేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## పంచాయతీలకు సెంట్రల్ ఫండ్స్ రిలీజ్.. ఇంకా రూ.1400 కోట్లు పెండింగ్

గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి నిధుల విడుదల ఊపందుకున్నది. రెండు వారాల వ్యవధిలోనే సుమారు రూ. 1,034 కోట్లు రిలీజ్ అయ్యాయి. ఇంకా దాదాపు రూ. 1400 కోట్లు రావాల్సి ఉన్నది. వచ్చే నెల 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అప్పటివరకు ఇవి కూడా విడుదల కావచ్చని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వర్గాల సమాచారం. ఈ నిధుల విడుదల కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కేంద్ర అధికారులతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నుంచి నిధుల విడుదల ఆగిపోయింది. రెండేండ్ల బకాయిలు దాదాపు రూ. 2,400 కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వ అంచనా. ఇవి కాక దాదాపు రూ. 600 కోట్లు మండల, జిల్లా పరిషత్‌లకు బకాయిలున్నాయి.

## అనన్య గ్లామర్

వరుస పరాజయాల తర్వాత అఖిల్ అక్కినేని గట్టిగా కమ్‌బ్యాక్ ఇవ్వాలని 'లెనిన్' సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. మురళీ కే కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పక్కా మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై లేటెస్ట్‌గా హాట్ బజ్ వినిపిస్తోంది. సినిమాలో ఒక భారీ స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండేను ఎంపిక చేసినట్టు టాక్.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

## అమిత్ షాపై వ్యాఖ్యలు..
# సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ

లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పరువు నష్టం కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరయ్యారు. గతంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు గాను పరువు నష్టం దావా వేశారు. తన స్టేట్‌మెంట్‌ను కోర్టులో నమోదు చేయడం కోసం ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి ఉదయం వచ్చి నేరుగా విచారణ కోసం సుల్తాన్‌పూర్ వెళ్లారు. పరువు నష్టం కేసులో కోర్టు విచారణ కోసం రాహుల్ గాంధీ సుల్తానాబాద్ వచ్చారని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రాయ్ వెల్లడించారు. విచారణ కోసం వచ్చిన రాహుల్ గాంధీ, కోర్టు పని పూర్తి కాగానే ఢిల్లీకి తిరిగి వెళతారని తెలిపారు. కాగా, రాహుల్ గాంధీ కోర్టుకు వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు సుల్తాన్‌పూర్‌లో 'సత్యమేవ జయతే' అంటూ రాసిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. 2018 కర్ణాటక ఎన్నికల సమయంలో అమిత్ షాపై రాహుల్ గాంధీ అవమానకరమైన వ్యాఖ్యలు



చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. 2024 జులై 26న కూడా రాహుల్ గాంధీ తన వాంగ్మూలాన్ని కోర్టులో నమోదు చేశారు. తనపై రాజకీయ కుట్రలో భాగంగా పరువు నష్టం దావా వేశారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ఆధారా లను సమర్పించాలని ఫిర్యాదుదారు విజయ్ మిశ్రాను కోర్టు నాడు ఆదేశించింది.




# మైత్రివనం ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్ని ప్రమాదం... తప్పిన ముప్పు

హైదరాబాద్‌లోని అమీర్‌పేట చౌరస్తా మైత్రివనం వద్ద ఉన్న ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనం మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీలగిరి బ్లాక్‌లోని రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాలలో మంటలు అలముకున్నాయి. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌లు ఉంటాయి. దీనితో ఆయా కోచింగ్ సెంటర్‌లలోని విద్యార్థులు కిందకు వచ్చేశారు. విద్యార్థులను పోలీసులు, హైడ్రా సిబ్బంది నిచ్చెనల ద్వారా కూడా సురక్షితంగా తీసుకువచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది హుటాహుటిన మైత్రివనంకు తరలి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొదటి అంతస్తు వరకు మంటలు రావడం, పొగలు రెండో అంతస్తు వరకు వ్యాపించడంతో భవనాన్ని ఖాళీ చేయించారు.



# జగన్‌తో భేటీ అయిన అంబటి రాంబాబు

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత ఆ పార్టీ అధినేత జగన్ ను కలిశారు. తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లి జగన్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, తనపై ప్రభుత్వం పెట్టిన కేసులు, టీడీపీ శ్రేణులు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసులు వ్యవహరించిన తీరును జగన్‌కు వివరించారు. అంబటి రాంబాబుతో పాటు జగన్ ను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేశ్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఉన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కేసులను చట్టపరంగా ఎదుర్కొందామని భరోసా ఇచ్చారు. ఇదే సమయంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరును జగన్ తప్పుబట్టారు.




## ఇన్స్టా అకౌంట్ బ్యాన్ కావడంపై
# యూట్యూబర్ అన్వేష్ రియాక్షన్

ప్రపంచ యాత్రల వీడియోలతో ఎంతో మంది ఫాలోయర్లను సంపాదించుకున్న తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేష్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ బ్యాన్ అవ్వడంపై బోల్డ్ రియాక్షన్ ఇచ్చాడు. మరో ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి వీడియో పోస్ట్ చేసిన అతను... "ఇన్‌స్టా అకౌంట్ పోయినందుకు నాకేం బాధ లేదు. రూపాయి రాని ఇన్‌స్టా ఉంటే ఏంటి పోతే ఏంటి? ఇన్‌స్టా ఛానల్స్ prapranchayatrikudu, naa_anveshana5... యూట్యూబ్ ఛానల్స్ naa anveshana, prapancha yatrikudu నాకు రెండు చేతులు, రెండు కాళ్లు లాంటివి. ఫేస్ బుక్ అకౌంట్ నా బాడీతో సమానం. ఎన్ని అకౌంట్లు బ్యాన్ చేసినా వీడియోలు చేయడం ఆపను. అన్నీ బ్యాన్ చేసినా.. వాటన్నింటినీ నడిపించే నా మైండ్ ని ఏం చేయలేరు. ఒక చేతిని విరగ్గొడితే ఇంకో చెయ్యి, రెండు కాళ్లతో ముందుకు వెళతా. రెండో చెయ్యి పోతే రెండు కాళ్లతో వెళతా. కాళ్లు కూడా తీసేస్తే బాడీతో పాకుకుంటూ వెళతా. దాన్ని కూడా తీసేస్తే నా బుర్రే ఆయుధంగా పనిచేస్తుంది. ఎవరెన్ని చేసినా.. నేను చేయాల్సింది చేస్తా.

## సభలోకి వెంకన్న ఫోటోలు..
# వైసీపీ సభ్యులపై కూటమి ఫిర్యాదు

ఏపీ రాజకీయాలు తిరుమల వేంకటేశ్వర స్వామి చుట్టే తిరుగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఆరోపణలతో మొదలైన వ్యవహారం రోజురోజుకీ ముదురుతోంది. ఏపీ శాసన మండలిలో కల్తీ నెయ్యి అంశం, హెరిటేజ్, ఇందాపూర్ డెయిరీల మధ్య సంబంధంపై చర్చించాలని వైసీపీ సభ్యులు కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు వేంకటేశ్వర స్వామి ఫోటోలతో సభలో నిరసన వ్యక్తం చేశారు. గోవిందా గోవిందా నినాదాలతో మండలి మారుమోగింది. సభలో వేంకటేశ్వరస్వామి ఫోటోలు ప్రదర్శించడం, అనంతరం టేబుల్‌పైనే వేసి వెళ్లడంపై కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రులు నారా లోకేష్, అనిత, గొట్టిపాటి రవి కుమార్, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పిడుగు హరిప్రసాద్, టీడీపీ ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ మోషేన్ రాజును కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ సభ్యులు దేవుడిని అవమానించారని పిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సభకు దేవుడి ఫోటోలు ఎలా అనుమతించారని ప్రశ్నించారు. సభలో వేంకటేశ్వర స్వామి ఫోటోలను ప్లకార్డులుగా ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు చెప్పలు వేసుకొని వేంకటేశ్వర స్వామి ఫోటోలను ప్లకార్డులుగా ప్రదర్శిస్తూ



ర్యాలీగా వచ్చారన్నారు. ప్రత్యక్ష దైవంగా కొలిచే వేంకటేశ్వర స్వామిని రాజకీయాల్లోకి లాగడం సరికాదన్నారు. ఈ ఘటనతో వైసీపీ నేతలకు, జగన్‌కు దేవుడి పట్ల ఏ రకమైన ఆలోచన ఉందో తెలుస్తోందన్నారు. ప్రతిరోజు వైసీపీ సభ్యులు సభలో వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేస్తున్నారని మండిపడ్డారు. శాసన మండలిలో వైసీపీ సభ్యుల తీరు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు.

# పీఎఫ్ ఉన్నవారికి త్వరలో కేంద్రం నుంచి శుభవార్త

ఈపీఎఫ్‌వో పెన్షన్ పరిమితిని పెంచాలని మరోసారి కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రస్తుతం ఈపీఎఫ్ కనీస పెన్షన్ పరిమితి నెలకు రూ.వెయ్యిగా ఉండగా.. దీనిని రూ.౯ వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. తాజాగా సుప్రీంకోర్టు, పార్లమెంట్‌లో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. లోక్‌సభలో ఇటీవల ఎంపీ డాక్టర్ కిర్సన్ నామ్ డియో పీఎఫ్ ఖాతాదారులకు పెన్షన్ పెంపుపై ఉద్యోగ సంఘాలు కేంద్రాన్ని కోరాయా.. లేదా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే సమాధానమిచ్చారు. కార్మిక సంఘాలతో పాటు ప్రజా ప్రతినిధుల నుంచి నెలకు రూ.వెయ్యి నుంచి పెంచాలని వినతులు వచ్చాయన్నారు. అయితే ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.

నెలకు కనీసం రూ.వెయ్యి

పెన్షన్ స్కీమ్ అనేది కాంట్రిబ్యూషన్-ప్రయోజనం పథకం అని శోభా కరంద్లాజే తెలిపారు. వేతనాల్లో 8.33 శాతం యాజమాని సహకారం ఉంటే.. కేంద్ర ప్రభుత్వం 1.16 శాతం అదనంగా పెన్షన్ స్కీమ్ కింద ఉద్యోగులకు ఇస్తుందని స్పష్టం చేశారు. దీంతో కనీసం నెలకు రూ.వెయ్యి పెన్షన్ అందుతుందన్నారు. ప్రస్తుతం 47,04,720 మంది శాశ్వత పెన్షనర్లు నెలకు రూ.౯ వేల కంటే తక్కువ పెన్షన్ పొందుతున్నారు. దీంతో పెన్షన్ పరిమితి పెంచాలని ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి డిమాండ్లు గత కొద్ది కాలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల పీఎఫ్ కనీస వేతన పరిమితిని రూ.15 వేల నుంచి పెంచడంపై సమీక్షించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఒకవేళ బేసిక్ శాలరీ లిమిట్ పెరిగే పెన్షన్‌కు జమ అయ్యే సొమ్ము కూడా పెరుగుతుంది.

# ఇరాన్‌తో ఉద్రిక్తతలు.. ట్రంప్‌నకు షాకిచ్చిన బ్రిటన్



తమ వైమానిక స్థావరం ఫెయిర్‌ఫోర్డ్ నుంచి ఇరాన్‌పై ముందస్తు దాడులకు అనుమతించేది లేదని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా అమెరికాకు స్పష్టం చేసింది. దాడులకు అనుమతిస్తే అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినట్టు అవుతుందని భావించిన బ్రిటన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో అమెరికా తన సైనికదళాలను మోహరిస్తోంది. ఇరాన్‌ను అడ్డుకునేందుకు ముందస్తు దాడులు చేయాల్సి రావచ్చనే అంచనాతో తగు ప్రణాళికలనూ రూపొందించుకుంది. ఇందులో భాగంగా హిందూ మహాసముద్రంలోని ఛాగోస్ ద్వీప సముదాయంలోని డియేగో గార్సియా సైనిక స్థావరంతో పాటు బ్రిటన్‌లోని ఫెయిర్‌ఫోర్డ్‌ను ఎంచుకుంది. ఇరాన్ దాడులను ః అడ్డుకునేందుకు ఈ రెండూ కీలకమని భావిస్తోంది. డియేగో గార్సియా సైనిక స్థావరాన్ని అమెరికా, బ్రిటన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. బ్రిటన్ ఆధీనంలోని ఫెయిర్‌ఫోర్డ్ వైమానిక స్థావరంలో అమెరికాకు చెందిన భారీ బాంబర్స్ సిద్ధంగా ఉన్నాయి. అమెరికా భారీ బాంబర్ విమానాలకు అనుకూలమైన వైమానిక స్థావరం యావత్ యూరప్‌లో ఫెయిర్‌ఫోర్డ్ ఒక్కటే. దీంతో, అవసరమైతే ఫెయిర్‌ఫోర్డ్‌ను వినియోగించుకునేందుకు అనుమతి కోసం అమెరికా పట్టుబడుతుండగా బ్రిటన్ నిరాకరించింది.

## నల్లమలలో కార్చిచ్చు..రెండు రోజులుగా
# ఎగిసి పడుతున్న మంటలు

నల్లమలలో కార్చిచ్చు రాజుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం తాటిగుండాల, బ్రహ్మగిరి సెక్షన్ పరిధిలోని మూడు ప్రాంతాల్లో 30 హెక్టార్లలో నిప్పు రాజుకున్నది. ఎండల తీవ్రతతో పొడిగడ్డి వేగంగా రాళ్లకు రాజుకొని మంటలు వ్యాపించాయి. బుధవారం ప్రారంభమైన మంటలను అటవీ శాఖ ఫైర వాచర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది రాత్రి వరకు అతికష్టం మీద ఆర్పారు. తిరిగి గురువారం ఉదయం మళ్లీ వ్యాపించడంతో బ్రహ్మగిరి రేంజ్ అధికారి గురుప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకొని ఫైర్ లోయర్ల ద్వారా మంటలను అదుపు చేశారు. అయినప్పటికి శుక్రవారం వరకు మంటలు అదుపులోకి రాలేదు. బ్రహ్మగిరి రేంజ్‌లోని వజ్రాల మడుగు అవిసి పెంట సమీపంలో మంటలు రెండు రోజులుగా ఎగిసి పడుతున్నాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో వందల హెక్టార్ల అటవీ సంపద, వన్యప్రాణుల ఆవాసాలు బూడిదయ్యాయి. అటవీ సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.



## 'నా సామిరంగా'

సినిమాతో తెలుగు యువ హృదయాలను ఆకర్షించిన అందాల భామ ఆషికా రంగనాథ్.. ఇటీవల సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీని కంటే ముందు 'గతవైభవం' అనే డబ్బింగ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. థియేటర్లలో పెద్దగా ఆడని ఈ సినిమాకి ఇప్పుడు ఓటీటీలో మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో సెట్స్ లో దిగిన కొన్ని ఫోటోలను ఆషిక సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది.